చలాయిస్తున్నారో అని అనుమానం. ఆయన ఎప్పుడో ఏదో సభలో మాట్లాడారట. ఏవో వ్యాసాలు రాశారట. ఇక వాటి గొడవ ఇంతా అంతా కాదు. ఈ జబ్బు చిన్న పిల్లలవరకూ పట్టుకొంది. ఆవేళ నేను ఏదో పుస్తకం తియ్యబోతూంటే, అదా, అది మా ఇంగ్లీషు డ్రామా అంది. నేనూ బి. ఏ. వరకూ చదువుకొన్నానని ఆవిడ కేం తెలుసు? ఇటువంటి వాళ్ళను కొంత కాలం వాళ్ళసత్తా తెలిసి వచ్చేట్టు వేరే ఉండనియ్యాలి. ఏం మీరుమాత్రం సూట్లు వేసుకోని పని లేకుండా తిరగలేరా? నాకు ఒకొక్కప్పుడు నిజంగా చాలా చిరాకు వేస్తుంది.'

మధ్యలో ఆమెను ఆపి, సుబ్బారావు 'ఇంకా నువ్వు చెప్పవలసింది రాత్రి చెప్పావు గానిలే. మరి నా మాట విను. వాళ్లకి గర్వం అన్నావే అసలది నీలోనూ బోలెడుంది. కాక, వాళ్లదది గర్వమే కాదు, చేతకాని తనాన్ని అసమర్థతనీ ఒప్పుకోలేక పడే మొగమాటం; ఏమయినా మా అన్నయ్య బాగా చదువుకొన్నాడు. నీకే మయినా చిరాకుగా ఉంటే మళ్లీ వేరే పోదాం గాని, మరేం మాటలు మిగలవు, అనవసరపు కల్లోలాలు వస్తాయి' అన్నాడు.

# సంఘం తరఫున పశ్చాత్తాపం

కొత్తపల్లి లలిత

తల్చుకొంటే కన్నీళ్లు వస్తున్న విప్పటికీ.

ఆనాడు... ఆ రిక్షావాడు—

నిజంగా ఎంత పాడు దినమో - అనుకుంటూ నిస్పృహ. లేకపోతే ఒక్క జట్కా కూడా దొరక్కపోవడం. ఆలస్యం చేస్తే కాలేజీ వేళమించి పోతుంది. సరేనని ఆరిక్షాలో కూర్చున్నాను.

గుంటలూ, మిట్టలూ, రాళ్లూ - ఇన్నిటినీ దాటుతూ తీసుకెళుతున్నాడు. ఎందుకో అప్రయత్నంగా వాడి కాళ్లకేసి చూశాను - ఎఱ్ఱగా మొద్దుబారి చీరుకొనిపోయి ఎండిన మోడుల్లా చూడటానికి అసహ్యంగా వున్నది...వాని పెళ్లానికిలాంటి కాళ్లు చూస్తే విడాకులివ్వాలనిపించదేమో!

'ఎటువైపమ్మా?' అంటూండే వాడి ముఖాన్ని పరిశీలనగా చూశాను... అబ్బ - ఎంత అందంగా భీకరంగా వున్నదో. ఆ మనిషి కళ్లలో నిస్పృహ, దానితోపాటు కడుపులో ఆకలిమంటలచే భుగభుగలాడే ఒక తరహా అయిన వికృతమైన చూపు - నా కళ్లలోకి చూసింది... అడివిలాంటి నల్లని జుట్టులోనుంచి చెమట పెదవులమీదుగా గుండెల మీదికి ప్రవహిస్తోంది. కండలు తేరిన చేతులు. ఎంత మోటుదనం. కాని ఆ భీభత్సంలో ఎంత అప్రతిహతమైన అందం!

మళ్లీ సందు తిరిగాము. పల్లమునుంచి ఎత్తుకి ఊపిరి బిగపట్టి బలమంతా కాళ్లమీదాన్చి పైకి లాగటానికి ప్రయత్నిస్తున్నాడు- అవును. ఇప్పుడు తెలిసింది- ఆ కాళ్లు ఎందుకట్లాగైనవో- లేకపోతే సూటూ బూటూ వేసికొనే అందరి కాళ్ళవలెనే వీడివికూడా సుకుమారంగానే వుండేవి. కాని— సిగ్గుతో ఉక్కిరిబిక్కిరయ్యాను - వాని అవస్థకు కన్నీళ్లు పర్యంతము వస్తున్నవి.

'ఏయ్. అబ్బీ - ఇటుచూడు - నిన్నే. నేను దిగుతానుండు' అంటూ మెల్లిగా దిగాను కిందికి.

ఆశ్చర్యంతో ఆయాసంతో ఒక్క నీరసమైన చూపును నావైపు పారద్రోలి నాకేసి చూస్తూ నిల్చున్నాడు. మెల్లిగా నవ్వుతూ పావలాకిబదులు ఎనిమిదణాల బిళ్ళ వాని చేతిలో పెట్టాను 'ఇక చాలును దగ్గరకొచ్చానుగా నడిచి వెళ్ళగలనులే, ఈ కాస్త దూరం' అన్నాను. అర్థం కానట్లుగా చూసి... వంగి రిక్షాను ఎత్తుకొని ముందుకు సాగాడు గంట మ్రోగించుకొంటూ - కాని ఆ ఒక్క క్షణం... అనిర్వచనీయమైనది. ఆ ఎనిమిదణాలు చూసుకొని నావైపు దీర్ఘంగా చూడటం, కృతజ్ఞతతో కాదు, మరోలా - వెళ్లిపోతుంటే నిల్చోలేక పోయాను. పాపం - ఒక జంతువులా బండిని లాక్కొని ఆ కాళ్లు చీరుకొని పోయేలా - జీవితం గడపాలా! లేకపోతే గడవదా? ఆ రిక్షావాని మీద ఎవ్వరికీ జాలిలేదా? ఇంత చేస్తే రోజు గడవదే - ఎంత అన్యాయం. మానవుణ్ని పశువు కన్నా హీనంగా తోటి మానవుడు వినియోగించుకోవడమా? ఆ రిక్షావాని జీవిత మింతేనా?